సాక్షి విశాఖపట్నం

గురువారం : 4 : మే : 2023



సెలవుల్లో క్రీడా వినోదం

వేసవి సెలవుల్లో విద్యార్థులు ఉత్సాహంగా గడిపేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. 8లో



పలు రైళ్ల రద్దు, మళ్లింపు

రాయపూర్ స్టేషన్ నాన్ ఇంటర్ లాకింగ్, యార్డ్ రీ మోడలింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో పలు రైళ్లను రద్దు చేశారు. 8లో



ఉద్యమాన్ని అణచలేరు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు రాస్తారోకో చేపట్టారు. 8లో

న్యూస్‌రీల్

సింహగిరిపై చందనం విక్రయాలు ప్రారంభం



చందనం ప్యాకెట్లు విక్రయిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

సింహాచలం: సింహగిరిపై చందనం విక్రయాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గత నెల 23న చందనోత్సవం రోజు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిపై ఉన్న చందనాన్ని ఒలిచి, భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. ఆ చందనాన్ని భక్తులకు ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి ప్రసాద విక్రయశాల వద్ద ఉన్న క్యూల్లో భక్తులకు ప్యాకెట్లు విక్రయించారు. ఆలయ సూపరింటెండెంట్ అప్పలనాయుడు భక్తులకు ప్యాకెట్లు అందించారు. ప్యాకెట్ 10 రూపాయలు చొప్పున రోజుకు 1000 ప్యాకెట్లు విక్రయాలు జరపనున్నారు.


రేపు అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు బుధవారం తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 2.30గంటలకు సుప్రభాత సేవ అనంతరం స్వామికి రెండో విడత చందనం సమర్పణ, ఆరాధన, బాలభోగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. అనంతరం స్వామికి ఆస్థానమండపంలో పంచకలశ స్నపనం జరిపిస్తామని తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.సుధ(టెక్నికల్) తెలిపారు. డిక్సన్ మ్యానుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ తిరుపతి, ల్యాండ్ మార్క్ గ్రూప్, ఆరోవానా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఎక్స్‌ప్రెస్ బీస్, రాక్‌మన్ ఇండస్ట్రీస్, ఖజానా జ్యూయలరీస్, కాన్‌సెంట్రిక్స్, ఎక్స్ టెక్ టెస్టింగ్ లిమిటెడ్, ఐనాక్స్, వైఎస్‌కె ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 435 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేటర్, కస్టమర్ రిప్రజెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, టెలీకాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, ఏఎస్ఎం, డేటా ఎంట్రీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్‌షిప్ అధికారులు, ప్లానింగ్ అధికారి, ఐటీ రిక్రూటర్, ట్రైనీలు, మేనేజర్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీకామ్(టాలీ), బీటెక్, ఎంబీఏ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఎండీకి ఫైనాన్స్ డైరెక్టర్ బాధ్యతలు



అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌కు డైరెక్టర్ (ఫైనాన్స్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతవరకు ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన వి.వి. వేణుగోపాలరావు ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయడంతో, ఆ బాధ్యతలను సీఎండీకి అప్పగించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు రెండో జాబితా

విశాఖ విద్య: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు రెండో జాబితాను ఉన్నతాధికారులు బుధవారం విడుదల చేశారు. ఈ జాబితాలో విశాఖపట్నం జిల్లాలోని 86 మంది విద్యార్థులకు అవకాశం లభించింది. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 9 నాటికి ఆయా పాఠశాలల్లో చేరాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. జిల్లాలో తొలి విడతలో 830 మంది ఎంపిక కాగా, వీరంతా ఇప్పటికే పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య అందించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇంకా ఎవరైనా ఉంటే, దరఖాస్తు చేసుకునేందుకు సైతం అవకాశం కల్పించింది. ఉచిత ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న అర్హులైన విద్యార్థులు ఈ నెల 6 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించేలా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు.

విశాఖ.. వైభోగం

- భోగాపురం ఎయిర్‌పోర్టు, అదానీ డేటా సెంటర్‌తో మారనున్న ముఖచిత్రం
- నాలుగు నెలల్లో వైజాగ్ – భోగాపురం ఆరులైన్ల రహదారి పనులు
- సీఎం జగన్ పర్యటనతో మురిసిన ఉత్తరాంధ్ర
- సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన : ముఖ్యమంత్రి పునరుద్ఘాటన



డేటా సెంటర్ నమూనాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన, డేటా సెంటర్‌కు భూమి పూజ చేసి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగరాన్ని అభివృద్ధిలో మరో మెట్టు ఎక్కించారు. ఆర్థిక రాజధానిగా భాసిల్లుతున్నా.. ప్రధాన నగరాలతో అన్ని రంగాల్లో పోటీ పడుతున్నా.. ద్వితీయ శ్రేణి నగరంగానే మిగిలిపోయిన విశాఖను.. టైర్-1 సిటీల సరసన నిలబెట్టేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రగతి పరుగును ప్రారంభించారు. ముఖ్యమంత్రి పర్యటనతో మురిసిన ఉత్తరాంధ్ర.. ఇకపై తమ ప్రాంతాన్ని వలసల ప్రాంతమని కాకుండా, విప్లవాత్మక అభివృద్ధి కేంద్రంగా పిలవాలంటూ నినదించింది. సెప్టెంబర్ నుంచి ఇక్కడే పరిపాలన ప్రారంభిస్తానంటూ సీఎం పునరుద్ఘాటించడంతో ఇక్కడి ప్రజల్లో ఉత్సాహం మరింత జోరందుకుంది.

ప్రపంచంలో ఏ నగరం చూసుకున్నా కనెక్టివిటీ తోనే అభివృద్ధి చెందింది. విశాఖలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నా భారత నౌకాదళంతో అనుసంధానమై ఉంది. దీంతో విదేశాలకు విమానాలు ఎగిరే అవకాశాలు తక్కువగా ఉండటంతో అభివృద్ధిలో అంతంతమాత్రంగానే మిగిలిపోయింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రాకతో ఇకపై ప్రపంచ దేశాలకు కనెక్టివిటీ పెరగనుంది. తద్వారా ఉత్తరాంధ్ర, సరిహద్దు జిల్లాలు అభివృద్ధి పథంలో పరుగులు పెట్టనున్నాయి. ఎయిర్‌పోర్టు రాకతో ఈ ప్రాంత ఎకానమీ మారనుంది. భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి 2026 నాటికి తొలి విమానం ఎగరనుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో.. ఉత్తరాంధ్రకు మంచిరోజులొచ్చాయని ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ ఎయిర్‌పోర్టును రూ.4,592 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

విశాఖ–భోగాపురం.. ఆరు లైన్ల రాదారి

పేరుకే భోగాపురం విమానాశ్రయం అయినప్పటికీ.. వైజాగ్ ఎయిర్‌పోర్టుగానే వ్యవహరించనున్నారు. ఎందుకంటే విశాఖపట్నం నుంచే ఎక్కువగా రాకపోకలు సాగనున్నాయి. అందుకే మహా నగరాన్ని భోగాపురంతో అనుసంధానించేందుకు ఆరులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కూడా జరగనుంది. మరో నాలుగు నెలల్లో దీనికి కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఆరులైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేను రెండు భాగాలుగా నిర్మించనున్నారు. హైవే రాకతో బీచ్‌రోడ్డుతో పాటు భీమిలి నుంచి భోగాపురం వరకు ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందనున్నాయి.

ఆసియా డేటా సెంటర్ రాజధానిగా విశాఖ

మధురవాడలోని ఐటీ హిల్–4లో డిజిటల్ విప్లవం మొదలుకానుంది. ఇది కేవలం విశాఖకే పరిమితం కాదు. యావత్ ఆసియా దేశాలకు పెద్దన్నగా మారనుంది. డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ సెంటర్లను 190 ఎకరాల్లో రూ.21,844 కోట్లతో అదానీ సంస్థ నిర్మిస్తోంది. ఏడేళ్లలోపు పూర్తికానున్న ఈ ప్రాజెక్టు ద్వారా 20 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 20 వేల మందికి పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు రానున్నాయి. సాంకేతికత రాజ్యమేలుతున్న నేపథ్యంలో.. విశాఖ నగరం డిజిటల్ రంగంలో ఆసియాకు రాజధానిగా భాసిల్లనుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 2030 నాటికి 1 గిగావాట్ డేటా సెంటర్‌గా ఇది దశలవారీగా అభివృద్ధి చెందనుంది. డేటా స్టోరేజ్ పెంచడంతో పాటు కృత్రిమ మేధ ఆవశ్యకత తెలిపేలా డిజిటలైజేషన్ విస్తరించడం, డేటా వేగం పెరగడం.. ఇలా విభిన్నమైన ప్రయోజనాలు అందించే ఈ ప్రాజెక్టు ద్వారా ఐటీ పరిశ్రమలు విశాఖకు క్యూ కట్టనున్నాయి. ఫలితంగా మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్ర యువతకు రానున్నాయి. సింగపూర్ నుంచి సబ్ మెరైన్ కేబుల్‌ను తీసుకొస్తూ.. డేటాసెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఇంటర్నెట్ డౌన్‌లోడ్ స్పీడ్ మరింత పెరగనుంది. దీని ద్వారా పరిశ్రమలకే కాకుండా.. ప్రజలకు కూడా ఈ ప్రాజెక్టు వరంలా మారనుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధిని ఓ ప్రాంతానికి మాత్రమే పరిమితం చేయడం తమ అభిమతం కాదనీ.. ఒక ప్రాజెక్ట్ ఏర్పాటైతే.. ఆ ప్రాంతంతో పాటు దాని పరిసరాలు కూడా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్న కాన్సెప్ట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కంకణం కట్టుకున్నామని సీఎం జగన్ స్పష్టం చేశారు.

త్వరలోనే ప్రథమ శ్రేణి నగరంగా..

దక్షిణ భారత దేశంలోనే మోస్ట్ అడ్వాన్స్‌డ్ సిటీగా, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా.. ఫిన్‌టెక్ హబ్‌గా.. ఇలా విభిన్న రంగాల్లో దూసుకుపోతున్న విశాఖ.. ఇంకా ద్వితీయ శ్రేణి నగరంగానే ముద్రపడిపోయింది. అందుకే వైజాగ్‌ను ప్రథమ శ్రేణి నగరాల సరసన చేర్చేందుకు కృషి చేస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్ డేటా సెంటర్ శంకుస్థాపన సందర్భంగా ప్రకటించారు. అలాగే సెప్టెంబర్ నుంచి విశాఖ కేంద్రంగానే పరిపాలన సాగిస్తామంటూ ముఖ్యమంత్రి మరోసారి స్పష్టం చేశారు.



అదానీ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ స్వాగతం





సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, మాజీ మంత్రి ముత్తంశెట్టి

గోపాలపట్నం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అదానీ డేటా సెంటర్‌తో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం ఉదయం 9.37 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అరకు ఎంపీ జి.మాధవి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ తదితరులు సీఎంకు పుష్పగుచ్ఛం అందించి.. స్వాగతం పలికారు. 9.56 గంటలకు హెలికాప్టర్‌లో ఆయన భోగాపురం పయనమయ్యారు. ఆయన వెంట మంత్రి అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలు వెళ్లారు. విజయనగరం, విశాఖ జిల్లాల్లో సీఎం జగన్ కార్యక్రమాలు ముగించుకుని.. వర్షం కారణంగా రోడ్డు మార్గంలో బయలుదేరి 4.28 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. 4.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు పయనమయ్యారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజిని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం తదితరులు వెళ్లారు.

పర్యటన సాగిందిలా..

విశాఖ విమానాశ్రయానికి బుధవారం ఉదయం 9.37 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సీఎం జగన్ అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా భోగాపురం బయలుదేరారు. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ హిల్–3కి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హిల్–4కి చేరుకుని అదానీ డేటాసెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

తర్వాత రుషికొండలోని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నివాసానికి చేరుకున్నారు. ఎంపీ కుమారుడు శరత్ చౌదరి, జ్ఞానిత దంపతులను ఆశీర్వదించారు. అనంతరం హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాల్సి ఉండగా.. వాతావరణం అనుకూలించకపోవడంతో రోడ్డు మార్గంలో విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ సీఎం వైఎస్ జగన్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు బూడి ముత్యాలనాయుడు, విడదల రజని, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, డా.బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, కన్నబాబు, గొల్ల బాబూరావు, కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎంఎస్ఎంఈ చైర్మన్ ఆడారి ఆనంద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

వైశాఖ పౌర్ణమికి పక్కా ఏర్పాట్లు

- వరాహ పుష్కరిణి వద్ద భారీ బందోబస్తు
- భక్తులు జెర్సీ, విదేశీ కోడెదూడలను సమర్పించొద్దు : ఈవో త్రినాథరావు



భక్తులు స్నానాలు ఆచరించే వరాహ పుష్కరిణి

సింహాచలం: ఈ నెల 5న శుక్రవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు దేవస్థానం ఏఈవోలు, ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైశాఖ పౌర్ణమికి అధిక సంఖ్యలో తరలివచ్చే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల భక్తులు, మత్స్యకారులను దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. భక్తులకు మంచినీరు, మజ్జిగతో పాటు అన్నప్రసాదం అందిస్తామని చెప్పారు. కొండ దిగువ వరాహ పుష్కరిణిలో పుణ్య స్నానాల కోసం భారీగా ఏర్పాట్లు చేయనున్నట్టు ఈవో తెలిపారు. నలుగురు గజ ఈతగాళ్లు, అదనపు సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచనున్నట్టు చెప్పారు. మెట్లమార్గంలో కూడా తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. జెర్సీ, విదేశీ కోడెదూడలను దేవస్థానం స్వీకరించడం లేదని చెప్పారు. వీటి స్థానంలో స్వామికి వెండి ప్రతిమలు భక్తులు సమర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు, నరసింహరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి



భరద్వాజ్ మృతదేహం



భరద్వాజ్ (ఫైల్)

ఆనందపురం : మండలంలోని వేములవలస వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమునిపట్నం మండలం, చిప్పాడ గ్రామానికి చెందిన సరగడ భరద్వాజ్ (25) గత ఆరేళ్లుగా జమ్ముకాశ్మీర్‌లో ఆర్మీ జవాన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల రాజస్థాన్ బదిలీకాగా ఈ నెల 1న సెలవుపై ఇంటికి వచ్చాడు. అతనికి వివాహం కాలేదు. మంగళవారం తన అన్న శివ, స్నేహితుడు వెంకటేష్‌తో కలిసి గ్రామ సమీపంలో గల లే అవుట్‌లో కారు డ్రైవింగ్ నేర్చుకున్నాడు. ఆ కారు మరమ్మతులకు గురికాగా అన్నయ్య శివను ఇంటికి పంపించేసి, కారుకు మరమ్మతులు చేయించడానికి స్నేహితుడు వెంకటేష్‌తో కలిసి తగరపువలస వెళ్లాడు. రాత్రి 10 గంటలైనా భరద్వాజ్ ఇంటికి రాకపోవడంతో అన్నయ్య శివ ఫోన్ చేయగా కారు మరమ్మతులు పూర్తయిన వెంటనే వచ్చేస్తానని చెప్పాడు. ఇందిలా ఉండగా వేములవలస జాతీయ రహదారిపై కారుని మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో భరద్వాజ్ తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు పోలీసులు భరద్వాజ్ అన్నయ్య శివకు సమాచారం అందించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు వెళ్లగా అప్పటికే భరద్వాజ్ మృతి చెందాడు. పెందుర్తి వైపు నుంచి వెళ్తున్న కారు ఎదురుగా రాంగ్ రూట్లో మోటార్ బైక్‌పై వస్తున్న భరద్వాజ్‌ని ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించినట్టు చెబుతున్నారు. కాగా తగరపువలసలో కారు మరమ్మతులు చేయిస్తున్న భరద్వాజ్ తన స్వగ్రామం చేరుకోవడానికి విజయనగరం రోడ్డు వైపు ప్రయాణించాల్సి ఉండగా రాత్రి వేళ రాంగ్ రూట్లో ఆనందపురం వైపు రావాల్సిన అవసరం ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. అలాగే భరద్వాజ్ ఏదో పనిపై మధురవాడ వెళ్లి వచ్చినట్టు మరో కథనం వినిపిస్తోంది. మృతునికి తండ్రి వెంకట రమణ, తల్లి అరుణ, సోదరుడు శివతోపాటు సోదరి ఉంది. వీరిది వ్యవసాయ కుటుంబం. ఎస్ఐ నరసింహమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో చిప్పాడలో విషాదం నెలకొంది. కారు రూపంలో మృత్యువు తమ కుమారుడిని పొట్టన పెట్టుకుందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కుమ్మరించిన వాన!

- పలుచోట్ల భారీ వర్షం
- నేడూ కురిసే అవకాశం





సాక్షి, విశాఖపట్నం: వాన కుమ్మరించింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరలు తెరలుగా కురుస్తూనే ఉంది. జనజీవనానికి అంతరాయం కలిగించింది. ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో వర్ష తీవ్రత అధికంగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో అనకాపల్లి జిల్లా పరవాడలో 6.1 సెం.మీలు, విశాఖ జిల్లా గోపాలపట్నంలో 5.6, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 4.8 చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది. గురువారం కూడా ఉమ్మడి విశాఖలో వానలు కొనసాగనున్నాయి.



ప్రాంతం	వర్షపాతం (సెం.మీలలో)
పరవాడ	6.1
గోపాలపట్నం	5.6
విశాఖ రూరల్	5.6
పెదగంట్యాడ	4.5
మల్కాపురం	4.5
గాజువాక	4.0
భీమునిపట్నం	3.5
పెందుర్తి	3.0



ఆటోడ్రైవర్ దారుణ హత్య

- కర్రతో దాడిచేసిన ఇద్దరు యువకులు
- సంఘటన స్థలంలో మృతి





ఆదినారాయణ మృతదేహం, ఆదినారాయణ(ఫైల్)

ఆరిలోవ: సస్పెక్టెడ్ షీటు ఉన్న ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. తెల్లారేసరికి రక్తపుమడుగులో ఉన్న అతడిని చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. దుర్గా బజార్‌లో నివాసముంటున్న ఏరుసుమాండాల ఆదినారాయణ అలియాస్ ఆది(30) ఆటో డ్రైవర్. ఆయన మంగళవారం రాత్రి స్నేహితుడి పుట్టినరోజు పార్టీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పార్టీ ముగించుకుని ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో బాలాజీనగర్ ప్రాంతంలోని జీవీఎంసీ సులభ్ కాంప్లెక్స్ వద్ద కూర్చున్న అదే ప్రాంతానికి చెందిన జగదీష్, శివ అనే ఇద్దరు యువకులను కలిశాడు. వారితో ఆదికి పరిచయం లేకపోయినా.. మాటలు కలిపి అక్కడే కొద్దిసేపు ఉన్నాడు. ఈ క్రమంలో వారిద్దరితో ఆదికి చిన్నపాటి గొడవ జరిగింది. ఆ గొడవ పెరిగి కొట్లాటకు దారితీసింది. ఆది అందుబాటులో ఉన్న కర్ర, బీరు బాటిల్ తీసుకుని వారిద్దరినీ కొట్టాడు. దీంతో ఆ యువకులు ఆదిపై తిరగబడి దాడి చేశారు. కర్రతో అతని తలపై బలంగా కొట్టారు. దీంతో ఆది సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. బుధవారం ఉదయం ఆరు గంటలకు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు.. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. రక్తం మడుగులో ఉన్న ఆది మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కాగా.. ఆదిని హత్య చేసిన జగదీష్, శివ పోలీసులకు లొంగిపోయారు. తాము ఆదిని హత్య చేశామని ఒప్పుకున్నారు. ఆది తమ వద్దకు వచ్చి కావాలనే గొడవపడి మమ్మల్ని కొట్టడంతో.. దాడి చేసినట్లు పోలీసులకు తెలిపారు. వారిద్దర్నీ అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు.

ఆదిపై సస్పెక్టెడ్ షీట్ : రెండేళ్ల కిందట ఆరిలోవ కాలనీలో ఓ యువకుడిని హత్య చేసిన కేసులో ఆది నిందితుడని సీఐ సోమశేఖర్ తెలిపారు. దీంతో ఆయనపై సస్పెక్టెడ్ షీటు తెరిచినట్లు తెలిపారు. ప్రతి ఆదివారం రౌడీ షీటర్లతో పాటు ఆది కూడా స్టేషన్‌కు వచ్చి రికార్డులో సంతకం చేస్తుండేవాడన్నారు. ఇప్పుడు ఈ హత్యకు పాత గొడవలు కారణమా.. యాదృచ్ఛికంగా యువకులు దాడి చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఆది తండ్రి బంగారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీఎం జగన్‌కు వినతి



ఉద్యోగుల సమస్యలు వివరిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట : విశాఖ పర్యటనకు బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర నగరంలో కలిసి వినతిపత్రం అందించారు. పంచాయతీ రాజ్‌లో డీఎల్‌డీవో పోస్టుల వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించి, సంబంధిత ఉత్తర్వులను పునః పరిశీలించాలని కోరారు.

రెండో రోజు కొనసాగిన సాక్షి మాక్‌టెస్ట్



ఆన్‌లైన్ మాక్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

ఆనందపురం : సాక్షి ఆధ్వర్యంలో మండలంలోని శొంఠ్యాంలోని ఎస్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మాక్ ఆన్‌లైన్ టెస్ట్ రెండో రోజైన బుధవారం కొనసాగింది. నీట్, ఎంసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థుల ప్రయోజనార్థం మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. రెండో రోజు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.టెక్నాలజీ పార్టనర్‌గా మైర్యాంక్ సంస్థ వ్యవహరిస్తోంది.

జనసేన కార్పొరేటర్‌కు ఇంగితజ్ఞానం ఉందా?

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ధ్వజం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

డాబాగార్డెన్స్: జీ–20 సదస్సులో భాగంగా జీవీఎంసీ పరిధిలో సుమారు రూ.83కోట్ల మేర పనులు జరిగితే.. రూ.100 కోట్ల అవినీతి జరిగిందంటూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి ఆరోపించడం సిగ్గుచేటని, అసలు ఆయనకు ఇంగిత జ్ఞానం ఉండే మాట్లాడుతున్నారా? అని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పలువురు ఎస్సీ, ఎస్టీ కార్పొరేటర్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఎస్టీ కార్పొరేటర్ కంపా హనోక్, ఎస్సీ కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, శశికళ, బల్ల లక్ష్మణరావు, మాసిపోగు మేరీజోన్స్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవీఎంసీ పూర్వ కమిషనర్ రాజాబాబుపై జనసేన కార్పొరేటర్ ఆరోపిస్తున్న తీరును వారు ఎండగట్టారు. ప్రభుత్వ పనులకు సంబంధించిన ఫైల్ ముందుగా కలెక్టర్ దగ్గరకు వెళ్తుందని, అక్కడ ఆయన పరిశీలించిన తర్వాత జీవీఎంసీకి వస్తుందని, జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం పొంది, తిరిగి కలెక్టర్ వద్దకు వెళ్తుందని చెప్పారు. అటువంటిది జీవీఎంసీలోనే అవినీతి జరిగిపోయిందని ఆ కార్పొరేటర్ ఇష్టానుసారంగా మాట్లాడడం అవివేకమన్నారు. వార్డు పరిస్థితి చూసుకోలేని అతను.. జీవీఎంసీ, అధికారులపై లేనిపోని ఆరోపణలు చేయడం అతని దిగజారుడుకు నిదర్శనమన్నారు. ఎక్కడ అవినీతి జరిగిందో చెప్పకుండా, దళిత ఐఏఎస్‌పై ఇష్టానుసారంగా మాట్లాడటం దారుణమన్నారు. రామానాయుడు స్టూడియోకి సంబంధించిన భూములు రెవెన్యూ పరిధిలో ఉంటాయని, అది కలెక్టర్ పరిధి అని.. జీవీఎంసీకి సంబంధమేంటని ప్రశ్నించారు. దళితుల ఆగ్రహానికి గురికావద్దని మూర్తిని హెచ్చరించారు.

గ్యాస్ట్రిక్ అల్సర్లకు కొత్త మందు

- ఏయూ ప్రయోగశాలలో ఆవిష్కరణ
- రూపకర్తలకు వీసీ ప్రసాదరెడ్డి అభినందన



రవికిరణ్, మధుమితలను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: గ్యాస్ట్రిక్ అల్సర్లకు ఏయూ విద్యార్థులు కొత్త మందును కనిపెట్టారు. వర్సిటీ జువాలజీ విభాగంలో నెలకొల్పిన ది సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ అప్‌లైడ్ బయలాజికల్ సైన్సెస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(టీ కాబ్సీఈ) ప్రయోగశాలలో ఈ నూతన ఆవిష్కరణ జరిపారు. హీలికోబాక్టర్ పైలోరి అనే బాక్టీరియా ఫలితంగా మనుషుల్లో గ్యాస్ట్రిక్ అల్సర్లు, కొన్ని సందర్భాలలో క్యాన్సర్లు సైతం వస్తాయి. ఇప్పటి వరకు ప్రపంచంలో ఈ బాక్టీరియాను నివారించే మందులు లేవు. ప్రపంచంలో 85 నుంచి 95 శాతం వరకు మనుషుల్లో ఈ బాక్టీరియా ఫలితంగా గ్యాస్ట్రైటిస్, గ్యాస్ట్రిక్ అల్సర్లు కనిపిస్తాయి. టీ కాబ్సీఈ ప్రయోగశాలలో కంప్యూటర్ ఉపయోగించి ఎంఏ01027 ప్రయోగాత్మక మందును తయారు చేశారు. ఈ ఔషధం బాక్టీరియాను నిరోధించినట్లు డాక్టర్ యేడిది రవికిరణ్, అగ్గున్న మధుమితలు జరిపిన పరిశోధనలో తేలింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో డాక్టర్ రవికిరణ్, మధుమితలను అభినందించారు. ఈ పరిశోధనకు ఏయూ ఐపీఆర్ సెంటర్ నుంచి పేటెంట్‌ను సైతం ఫైల్ చేశారు.

నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల పరిశీలన



నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల తీరును పరిశీలిస్తున్న డీఆర్ఎం సత్పతి

అగనంపూడి (గాజువాక): దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద వారం రోజులుగా కొనసాగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనులను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి బుధవారం పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో భద్రతకు సంబంధించిన ఆధునికీకరణ పనులను గత నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. గతంలో ఉన్న ప్యానల్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్‌ను ఆధునికీకరిస్తూ ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ పద్ధతికి మార్చుతున్నారు. ఆ పనులను డీఆర్ఎం బుధవారం జోరువానలోనూ పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. ఆయన వెంట సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో–ఆర్డినేషన్) పి.కె. మహారాణా, సీనియర్ డివిజనల్ సిగ్నల్, టెలికాం ఇంజినీర్ దీప్తాంశు శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెలవుల్లో క్రీడా వినోదం

- ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ప్రత్యేకం
- ప్రతీ రోజూ రెండున్నర గంటలు ఆటలు
- పాఠశాల పీఈటీలకు పర్యవేక్షణ బాధ్యతలు
- గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి వినోదం



అడవివరం హైస్కూల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. విద్యార్థులు చదువుల నుంచి దూరం కాకుండా, వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రతీ రోజూ ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు క్రీడా మైదానంలో విద్యార్థులంతా ఉండేలా పాఠశాల పీఈటీ/పీడీలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి, వేసవి క్రీడా వినోద కార్యక్రమాలపై విద్యార్థులకు పీఈటీ, పీడీలు మార్గనిర్దేశం చేస్తున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ద్వారా అవసరమైన క్రీడా పరికరాలను అందించేలా ఏర్పాట్లు చేశారు.

ప్రతిభ చూపితే ప్రశంసలు

వేసవిలో నిర్వహించే క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. తరగతి వారీగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్‌చేసి, విద్యార్థులు ప్రతీ రోజూ ఏం చేశారనేది నోట్ పుస్తకంలో రాసేలా క్లాస్ టీచర్ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ప్రతిభ చూపిన విద్యార్థుల ఫొటోలు, వారి చేసిన అంశాలకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియా, పాఠశాల వెబ్‌సైట్‌లలో ఉంచేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాల్సి ఉంది.

గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంప్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నారు. గ్రంథాలయాల్లో ప్రతీ రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేశారు. కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాల్లో విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా గ్రంథాలయ సంస్థ అధికారులు దృష్టి సారించారు.

జాతీయ పోటీలకు సన్నద్ధం



విద్యార్థులు చదువులతో పాటు, క్రీడల్లోనూ రాణించేలా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేసేలా చర్యలు చేపట్టాం. ఈ వేసవిలోనే జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. – రాయల సత్యనారాయణ, డీపీఈవో, విశాఖ జిల్లా

విద్యార్థులకు మేలు చేసేలా...



విద్యార్థులకు మేలు చేయాలనే లక్ష్యంతో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నాం. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో జూన్ 8 నుంచి కార్యక్రమాలు జరుగుతాయి. సచివాలయ సిబ్బంది, గ్రామ/వార్డు వలంటీర్లను సమన్వయం చేసుకొని విజయవంతం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. – ఆర్.సిహెచ్. వెంకట్రావు, గ్రంథాలయ కార్యదర్శి, ఉమ్మడి విశాఖ జిల్లా

యోగా శిబిరాలకు స్పందన



క్రీడలతో విద్యార్థులు శారీరక, మానసిక ధృడత్వం కలుగుతుంది. వేసవి వినోదం పేరిట నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులందరినీ భాగస్వామ్యులను చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రస్తుతం మా పాఠశాలల్లో యోగా శిబిరాలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల నుంచి మంచి స్పందన ఉంది. – బి.రామచంద్రనాయుడు, ఫిజికల్ డైరెక్టర్, అడవివరం జెడ్పీ హైస్కూల్

పాలప్యాకెట్‌కు వెళ్లి..బైక్ ఢీకొని

వివాహిత మృతి



మృతురాలు రమాదేవి

ఆరిలోవ: భర్త నిద్ర లేచేసరికి టీ పెట్టి ఇవ్వాలన్న ఉద్దేశంతో తెల్లవారుజామున పాల ప్యాకెట్ కోసం వెళ్లిన ఓ వివాహిత ద్విచక్ర వాహనం ఢీకొని దుర్మరణం చెందింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొకర రమాదేవి(43) భర్త రామారావు, ఇద్దరు పిల్లలతో చినగదిలి ప్రాంతం రామలక్ష్మణపురంలో నివాసముంటోంది. రామారావు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రమాదేవి గృహిణి. బుధవారం ఉదయం రమాదేవి పాల ప్యాకెట్ కోసం హెల్త్ సిటీలోని జిమ్స్ ఆస్పత్రి పక్కనే ఉన్న విశాఖ డెయిరీ షాపు వద్దకు వెళ్లడానికి బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతోంది. అదే సమయంలో హనుమంతవాక నుంచి అడవివరం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆమెను బలంగా ఢీకొంది. దీంతో ఆమె కిందపడి స్పృహ కోల్పోయింది. విషయం తెలుసుకున్న రామారావు, కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో హెల్త్‌సిటీలో ఓ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచింది. వై.సందీప్ అనే వ్యక్తి రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై మితిమీరిన వేగంతో వచ్చి రమాదేవిని ఢీకొట్టాడని భర్త రామారావు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నేడు

- ఉదయం 10.30 గంటలకు రైల్వేస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఎస్.ఆర్.కె బైక్, కారు రెంటల్ కౌంటర్ ప్రారంభం
- సాయంత్రం 5.30 గంటలకు లాసన్స్ బేకాలనీ అసంగానంద ఆశ్రమంలోని శ్రీ మృత్యుంజయేశ్వర ఆలయంలో త్యాగరాజ కీర్తనలాపన
- సాయంత్రం 6 గంటలకు శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో నరసింహ స్వామి జయంతి వేడుకలు

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.61,640
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,500
వెండి(కిలో):	రూ.81,800

ఉక్కు ఉద్యమాన్ని అణచలేరు



మద్దిలపాలెం కూడలిలో ఆందోళన చేస్తున్న నాయకులు



పెదగంట్యాడ జంక్షన్‌లో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో
- నిలిచిపోయిన ట్రాఫిక్.. పలువురు అరెస్ట్

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం కూర్మన్నపాలెం కూడలి స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు రాస్తారోకో చేపట్టారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రాస్తారోకోలో భాగంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నాయకులు, కార్మికులు జాతీయ రహదారిపై బైఠాయించారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. దీంతో హైవేపై ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన హామీని ఇవ్వాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దీంతో నిరసన చేస్తున్న 26 మంది కార్మిక సంఘాల నేతలు, కార్మికులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన నేతలు.. ఉక్కు ఉద్యమం పడిలేచిన కెరటం లాంటిదని, అణచివేతతో ఉక్కు ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఆందోళనలో డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, ఎన్.రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, 78వ కార్పొరేటర్ గంగారాం, యు.రామస్వామి, ప్లాంట్ ఉద్యోగులు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. అలాగే పాత గాజువాకలో జరిగిన రాస్తారోకోలో పాల్గొన్న 15 మందిని, మద్దిలపాలెం జంక్షన్‌లో జరిగిన ఆందోళనలో 25 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెదగంట్యాడ జంక్షన్‌లో వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	445.00
విజయనగరం	449.00
శ్రీకాకుళం	449.00

కోవిడ్-19 అప్‌డేట్

మహారాణిపేట: విశాఖ జిల్లాలో బుధవారం 8 కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 153 మందికి పరీక్షలు చేయగా.. ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చింది. మొత్తం కరోనా బాధితుల సంఖ్య 27కి చేరింది. 25 కేసులు హోం ఐసోలేషన్‌లో, 2 కేసులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

పలు రైళ్ల రద్దు, మళ్లింపు



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): రాయపూర్ స్టేషన్ నాన్ ఇంటర్ లాకింగ్ పనులు, యార్డ్ రీ మోడలింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే విశాఖపట్నం–దుర్గ్–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్టు డీసీఎం త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న విశాఖపట్నం–దుర్గ్(18530) ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో 9న దుర్గ్–విశాఖపట్నం (18529) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయని పేర్కొన్నారు.

- ఈ నెల 4, 9వ తేదీల్లో విశాఖపట్నం–రాయ్‌పూర్(08528) పాసింజర్ స్పెషల్ మహాసముంద్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో 5, 10 తేదీల్లో రాయపూర్–విశాఖపట్నం(08527) పాసింజర్ స్పెషల్ రాయపూర్ నుంచి కాకుండా మహాసముంద్ నుంచి బయల్దేరుతుంది.
- దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ నెల 6, 8వ తేదీల్లో విశాఖపట్నం–కాచిగూడ(12861) ఎక్స్‌ప్రెస్ రద్దయింది.
- ఈ నెల 8న అహ్మదాబాద్–పూరి(12844), లోకమాన్యతిలక్ టెర్మినస్–విశాఖపట్నం(22848) ఎక్స్‌ప్రెస్‌లు రాయపూర్ మీదుగా కాకుండా వయా సరోనా, ఉర్‌కుర, బిలాస్‌పూర్, ఝార్సుగుడ మీదుగా నడుస్తుంది.
- 9న కోర్బా–విశాఖపట్నం(18517) ఎక్స్‌ప్రెస్ వయా ఝార్సుగూడ, సంబల్‌పూర్, టిట్లాఘడ్ మీదుగా నడుస్తుంది. ఈ రైలు ఆ తేదీలో చంపా–టిట్లాఘడ్ మధ్య రద్దు చేశారు.
- 9న విశాఖపట్నం–నిజాముద్దీన్ (12807) సమతా ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ, బల్హార్షా, నాగ్‌పూర్ మీదుగా నడుస్తుంది. ఈ రైలు ఆ తేదీలో విజయనగరం–నాగ్‌పూర్ మధ్య రద్దయింది.
- 9న బిలాస్‌పూర్–తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్ వయా ఝార్సుగూడ, సంబల్‌పూర్, టిట్లాఘడ్ మీదుగా నడుస్తుంది. ఈ రైలు ఆ తేదీలో బిలాస్‌పూర్–టిట్లాఘడ్ మధ్య రద్దయింది.
- 6న బిలాస్‌పూర్–తిరుపతి(17481) వయా రాయ్‌పూర్, గొండియా, బల్హార్షా, వరంగల్, విజయవాడ మీదుగా నడుస్తుంది. ఈ రైలు ఆ తేదీలో మహాసముంద్–గుడివాడ మధ్య రద్దు చేశారు.

పరీక్ష తప్పిన విద్యార్థులకు ఉత్తమ శిక్షణ



విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న ఉపాధ్యాయుడు

ఆనందపురం : ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు నైపుణ్యం గల ఉపాధ్యాయులచే ఉత్తమ శిక్షణ అందిస్తున్నామని డీఈవో చంద్రకళ చెప్పారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదివి ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల కోసం సబ్జెక్ట్‌ల వారీగా శిక్షణ అందించడానికి ఆనందపురం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్రాన్ని పరిశీలించిన చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులు తప్పిన సబ్జెక్ట్‌లలో సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేటట్టు తర్ఫీదునిస్తున్నామని చెప్పారు. పరీక్షలు పూర్తయ్యే వరకు శిక్షణ ఉంటుందన్నారు. 99 మంది విద్యార్థులకు శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీ శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ ఎం.నాయుడు, ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి, పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారి 52వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న శ్రీనివాస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం డీజీఎం కర్రి శ్రీనివాస్ 52వ సారి రక్తదానం చేశారు. అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి అరుదైన ఓ నెగెటివ్ గ్రూప్ రక్తం అవసరమైంది. ఆ విషయం తెలిసిన శ్రీనివాస్ వెంటనే ఆస్పత్రికి వెళ్లి, రక్తదానం చేశారు. ఇప్పటివరకు ఆపదలో ఉన్న 52 మందికి రక్తదానం చేసి, ఆదుకున్న శ్రీనివాస్‌ను విభాగం ఉన్నతాధికారులు, సహోద్యోగులు అభినందించారు.